క్లుప్తంగా

సండే సండడి



తిక్కవానిపాలెం తీరంలో సందర్శకులు

పరవాడ: తిక్కవానిపాలెం సముద్ర తీరం సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. గాజువాక, కూర్మన్నపాలెం, స్టీల్‌ప్లాంటు, పరవాడ, దేశపాత్రునిపాలెం, ఎన్టీపీసీ తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు తీరంలో సందడి చేశారు. ఇసుక తిన్నులపై ఆట పాటలతో సరదాగా గడిపారు. సాయంత్రం జలకాలాటల్లో మునిగితేలారు.

3న విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: పరవాడ, వాడచీపురుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో చేపట్టనున్న నిర్వహణ పనుల్లో భాగంగా ఈ నెల 3వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ పరవాడ ఏఈ శేషసాయి ఒక ప్రకటనలో తెలిపారు. పరవాడ, వెన్నలపాలెం, భర్నికం, రావాడ, ఈ.బోనంగి, తానాం, గొర్లివానిపాలెం, దేశపాత్రునిపాలెం, పి.ఎస్.బోనంగి, కలపాక, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, దోసూరు, వెంకటాపురం గ్రామాలకు ఆరోజు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ శేషసాయి పేర్కొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణ మార్మోగింది. రాధాకృష్ణ, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మహారాణిపేట : ఏపీ జేఏసీ (అమరావతి) విశాఖ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. పరిశీలకుడిగా ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ కృష్ణమూర్తి వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా సత్తి నాగేశ్వరరెడ్డి తిరిగి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాసరావు(ఆర్టీసీ), అసోసియేట్ చైర్మన్‌గా ఎస్.ఎ.త్రినాథరావు (రెవెన్యూ, డిప్యూటీ తహసీల్దార్), వైస్ చైర్మన్‌గా ఎ.శ్రీనివాసరావు (దివ్యాంగుల శాఖ), నమ్మి శ్రీనివాసరావు (నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం), సీహెచ్ రామకృష్ణమూర్తి (భాషా పండితుల సంఘం), వైస్ చైర్మన్ (ఉమెన్ వింగ్) డాక్టర్ పూర్ణిమ (వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సర్వీసెస్ అసోసియేషన్) కార్యదర్శి కె.సురేష్‌కుమార్(గ్రామవార్డు సచివాలయాలు), ఎ.శ్రీనివాసరావు (పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్), కార్యదర్శి ఎస్.మేఘశ్యామ్ వెంకటేష్ యాదవ్ (ఏపీ స్టేట్ లేబర్ డిపార్టుమెంట్), కార్యదర్శిగా పీయూఎస్ మహేష్ (ఏపీ రెవెన్యూ అసోసియేషన్), కార్యదర్శి (ఉమెన్ వింగ్) ఆర్. అనూష (ఏపీ రూరల్ వాటర్ సప్లైస్ ఇంజినీర్స్), కోశాధికారిగా బి.రవిశంకర్ (డిప్యూటీ తహసీల్దార్) తదితరులు ఎన్నికయ్యారు.

విద్యుత్ కార్మిక సంఘంలో పలువురి చేరిక

మహారాణిపేట : తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘంలో ఆదివారం ఉదయం డిస్కం అధ్యక్షుడు బీఎం నాయుడు, కార్యదర్శి బీవీ రవీంద్ర సమక్షంలో సీనియర్ బీఎంఎస్ యూనియన్ నాయకుడు టీవీ రమణమూర్తి, మరి కొంత మంది సభ్యులు చేరారు. ఈ సందర్భంగా బీఎం నాయుడు మాట్లాడుతూ సీనియర్ నాయకులు రమణమూర్తి రాకతో యూనియన్‌కు బలం చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోన రవికిషోర్, డిస్కం కార్యవర్గ సభ్యులు సుందరపు మహేష్, జిల్లా అధ్యక్షుడు వేదుల నగేష్, కార్యవర్గ సభ్యులు కె. నాయుడుబాబు పాల్గొన్నారు.

పారదర్శక పాలనే ధ్యేయం

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



పార్టీ నాయకులతో కలిసి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా ప్రజలకు అందించేందుకు వైఎస్సార్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. సబ్బవరంలోని ఆ పార్టీ కార్యాలయంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై ఆదివారం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పీపుల్ సర్వేకు ప్రజల నుంచి వస్తున్న మద్దతు చూసి ప్రతి పక్షాలకు షాక్ కొట్టినట్టు ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదం మార్మోగుతుందన్నారు. కరుడుగట్టిన టీడీపీ కార్యకర్తలు మినహా మిగిలిన వారంతా మేం అంతా మీ వెంటే ఉన్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మద్దతు పలుకుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.45 లక్షల కుటుంబాలు సీఎం జగన్ వెంట ఉన్నామని మద్దతు తెలపగా.. 1.10 లక్షల కుటుంబాలు ముఖ్యమంత్రి సందేశాన్ని విని తమ వెంట నడుస్తామని భరోసా కల్పించాయన్నా రు. ఒక పెందుర్తి నియోజకవర్గంలోనే 91,166 కుటుబాలకు గానూ 76,823 కుటుంబాలను ఈ సర్వే ద్వారా కలవడంతో 84.27 శాతం మంది తమ మద్దతు తెలియజేశారని తెలిపారు. విపక్ష టీడీపీకి 2014 నుంచి 2019వరకూ అందించిన పరిపాలన మరలా అందిస్తామని ప్రజలను ఓటు అడిగే దమ్ముందా అని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. మేం అందించిన పాలన మీకు నచ్చితేనే ఓటు వెయ్యండి అని అడిగే దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. మరో సారి 2024లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలనే ఏకైక నినాదంతో పార్టీ నాయకులంతా సమష్టిగా పనిచేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, ఎంపీపీ బోకం సూర్యకుమారి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, మాజీ ఎంపీపీ గొర్లి ఉమా మహేశ్వరరావు, మండల లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. వెంకన్న కల్యాణం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



వెంకన్న కల్యాణ ఉత్సవమూర్తులు

పరవశించిన భక్తజనం

సింహాచలం: పెందుర్తి వెంకటాద్రిపై జరుగుతున్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో మూడోరోజు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని కనులారా తిలకించి పులకించిపోయారు. స్వామివారి ఉత్సవమూర్తులు వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అజయ్‌రాజ్, 97వవార్డు అధ్యక్షుడు మెంటి మహేష్ తదితరులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, కార్పొరేటర్ ముమ్మన దేముడు తదితరులు

మన్‌కీబాత్‌తో వైవిధ్యానికి గుర్తింపు

- ఘనంగా మన్‌కీబాత్ 100వ ఎపిసోడ్ వేడుకలు



మన్‌కీబాత్‌ను తిలకిస్తున్న గొర్లె రామునాయుడు, విద్యార్థులు

సింహాచలం: మన్‌కీ బాత్ కార్యక్రమం ప్రారంభమైన తర్వాత దేశంలో మారుమూల ప్రాంతాల్లోని ప్రత్యేక కళలు.. వస్తువులకు గుర్తింపు వచ్చిందని బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు అన్నారు. మన్‌కీ బాత్ 100వ ఎపిసోడ్‌ను వీక్షించడానికి వీలుగా ప్రాంతాల్లో ఆదివారం రామునాయుడు ప్రత్యేక స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. చినముషిడివాడలోని కైట్స్ స్కిల్‌డవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులతో కలిసి రామునాయుడు ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాన్ని వీక్షించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏటికొప్పాక గురించి ప్రధాని ప్రస్తావించడం మనం గర్వించదగ్గ విషయమని రామునాయుడు అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జ్యోతి, కాళ్ల జగన్, అచ్చెంనాయుడు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యం కోసమే మన్‌కీ బాత్

పరవాడ: మనకీ బాత్ వందో ఎపిసోడ్‌ను ముత్యాలమ్మపాలెం గ్రామంలో ఆదివారం మండల యువమోర్చా నాయకుడు మూస రామకృష్ణ స్వగృహంలో భాజపా నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. సామాన్యుల అవసరాలు, ఆశయాలను ఆచరణలోకి తేవడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని యువమోర్చా నాయకుడు రామకృష్ణ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి మోదీ తన మాటల ద్వారా ప్రజలను చైతన్యం వంతం చేయడానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు వాసుపల్లి సోమశేఖర్, భాజపా కార్యకర్తలు నాగరాజు, మహేష్, రాజేష్, ఎల్లయ్య, నూకరాజు, ముఖేష్ పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

గుండెపోటుపై అప్రమత్తత అవసరం

మురళీనగర్: గుండెపోటు ప్రమాదాలను నివారించేందుకు 40 ఏళ్లు దాటిన వారు తప్పనిసరిగా ఆరు నెలలకోసారి కాల్షియం స్కోరింగ్ టెస్ట్ చేయించుకుని వైద్యుల సలహా ప్రకారం మందులు వాడాలని కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్, ఎస్ఆర్ఐ ఆస్పత్రి సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని ఆరోగ్య సలహాలు అందించారు. ప్రతిరోజు కనీసం 20 నిమిషాలు నడవాలని, కనీస వ్యాయామం చేయాలని, బయట జంక్ ఫుడ్ తినడం మానుకోవాలన్నారు. గ్యాస్ట్రిక్, గుండెలో నెప్పి, భుజం నెప్పి, ఆయాసం ఎక్కువగా ఉంటే తప్పనిసరిగా డాక్టర్‌ను సంప్రదించం ద్వారా గుండెపోటు ప్రమాదాల నుంచి బయటపడవచ్చని వివరించారు. డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఫిజీషియన్ పి.ప్రసాద్‌లు 182 మందికి బీపీ, సుగర్‌తోపాటు ఈసీజీ, 2డీ ఎకో వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 32 మందికి ఎస్ఆర్ఐ ఆస్పత్రిలో ఉచిత పరీక్షలకు కార్డులు అందించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి ఎల్.వెంకటసుధాకర్, వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి కె.ద్వారకానాథ్, పూర్వ అధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్య, కోశాధికారి జె.కూర్మారావు, జాలి వాకర్ ఎన్.ప్రకాశరావు, సంయుక్త కార్యదర్శి ఎస్.సీతారామ కృష్ణ, కార్యవర్గ సభ్యులు వైద్య శిబిరం నిర్వహణకు సహకరించారు.

ఏకతాటిపై ఉంటేనే గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న ముమ్మన దేముడు

శ్రీకృష్ణ దేవరాయల కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముమ్మన దేముడు

సింహాచలం: అంతా ఏకతాటిపై ఉంటేనే తగిన గుర్తింపు లభిస్తుందని శ్రీకృష్ణదేవరాయల కాపు సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు ముమ్మన దేముడు అన్నారు. వేపగుంటలోని శ్రీకృష్ణ దేవరాయల కల్యాణ మండపంలో ముమ్మన ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పెందుర్తి మండలంలోని కాపు సామాజికవర్గానికి చెందిన పలువురు పాల్గొన్నారు. పలు అంశాలను ప్రతిపాదించి ఏకగ్రీవంగా ఆమోదించారు. సంఘంలో సభ్యత్వ నమోదు కోసం రూ. 500 చెల్లించాలని, కనీస విరాళం రూ.5వేలు ఇచ్చిన వారి పేర్లు శిలాఫలకంపై నమోదుచేయాలని నిర్ణయించారు.

తీర్మానాలివీ

- సంఘం పేరిట బ్యాంక్ ఖాతా తెరవాలి.
- భవనం చుట్టూ కాపౌండ్‌వాల్ నిర్మించడంతో పాటు గ్రావెల్ ఫిల్లింగ్ చేయించాలి.
- భవనానికి సంబంధించి స్థలంతో పాటు భవనాన్ని సంఘానికి అప్పగించాలని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు వినతి పత్రాలు అందించాలి.
- గాజువాక నాలుగు కూడలి జంక్షన్‌లో మాజీ మంత్రి దివంగత గడివాడ గురునాథరావు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఆమోదించిన జీవీఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి నక్క కనకరాజు, సభ్యులు బండి సత్తిబాబు, తామర్ల నర్సింగ్, సూరిదేముడు పాల్గొన్నారు.

బాలభానుమూర్తికి ఎక్స్‌లెన్స్ సర్వీస్ అవార్డు



అవార్డు అందుకుంటున్న బాలభానుమూర్తి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలేనికి చెందిన సామాజిక కార్యకర్త విజినిగిరి బాలభానుమూర్తికి నేషనల్ ఎక్స్‌లెన్స్ సర్వీస్ అవార్డు లభించింది. వరాహ వెంకటేశ్వర ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మరియు జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ సంయుక్తంగా వివిధ రంగాల్లో కృషి చేసిన 60 మంది ప్రతిభావంతులను అవార్డులకు ఎంపిక చేసింది. నగరంలోని జిల్లా పరిషత్ హాల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, రాష్ట్ర వినియోగదారుల కోర్టు కమిషన్ సభ్యుడు సి.వి.సూర్యభాస్కరం చేతులమీదుగా బాలభానుమూర్తి అవార్డు అందుకున్నారు. అవార్డు రాకతో తనపై మరింత బాధ్యత పెరిగిందని బాలభానుమూర్తి తెలిపారు. కార్యక్రమంలో వరాహ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మారెళ్ల ప్రసాద్, జాతీయ నియోదారుల హక్కుల కమిషన్ వ్యవస్థాపక చైర్మన్ వీఎల్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా నిందితులకు రిమాండ్

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా 12 కిలోల గంజాయిని తరలిస్తున్న తమిళనాడుకు చెందిన యువకులు ఎస్కిపాండ్యన్, అరవింత్‌ను ద్వారకా జోన్ సీఐ సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేంద్ర అదుపులోకి తీసుకుని విచారించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించారు.

మంచిగా నడుచుకోండి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల జోలికి పోకుండా మంచిగా జీవించాలని సూచించారు. ఎటువంటి తగాదాలు, గొడవల్లో తలదూర్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో ఉంటున్నారా.. లేదా, వారి దినచర్య తదితర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తించుకుని సన్మార్గంలో నడుచుకోవాలని రౌడీ షీటర్లకు సీఐ సూచించారు.

ఫోర్త్ టౌన్ పీఎస్‌లో.. : ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీ షీటర్లకు సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎస్ఐ వెంకటరావు కౌన్సెలింగ్ చేశారు. సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని హెచ్చరించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు.

వ్యక్తి ఉన్నతికి విద్య దోహదం



ఆచార్య వెలమల సిమ్మన్నను సత్కరిస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: విద్య వ్యక్తి ఉన్నతికి దోహదపడుతుందని ఆంధ్రవిశ్వవిద్యాలయం తెలుగు విశాభం విశ్రాంత ఆచార్యులు వెలమల సిమ్మన్న అన్నారు. ఆదివారం దూరవిద్య కేంద్రంలో దూరవిద్యలో ఎంఏ తెలుగు అభ్యసిస్తున్న విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్య వారసత్వంగా లభించే సంపద కాదని, ఎవరికి వారే సంపాదించుకోవాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంల జీవితాలు వీటిని ఉదాహరణలన్నారు. అతి సామాన్య కుటుంబంలో జన్మించినప్పటికీ తమ స్వశక్తితో వీరు జ్ఞానసముపార్జన చేసి దేశం గర్వించే స్థానాలను అధిరోహించారన్నారు. మనుషుల మధ్య దూరాన్ని చెరిపేసి, సమానత్వాన్ని సాధింపచేసేది విద్య మాత్రమేనన్నారు. వ్యక్తిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి విద్య ఉపకరిస్తుదంన్నారు. కార్యక్రమానికి తెలుగు ఆచార్యులు డా.బూసి వెంకటస్వామి అధ్యక్షత వహించారు. తమకు పాఠాలు బోధించిన గురువులను దూరవిద్యాకేంద్ర విద్యార్థులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో తెలుగు చార్యులు డాక్టర్ పెండ్యాల లావణ్య, డాక్టర్ యల్.గిరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



ముడసర్లోవ పార్కులో ఏయూ హైస్కూల్ 1988 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

ఆరిలోవ: ఆంధ్రా యూనివర్సిటీ ఉన్నత పాఠశాలలో 1988 బ్యాచ్‌లో పదో తరగతి చదువుకొన్న పూర్వ విద్యార్థులు ఆదివారం ముడసర్లోవ పార్కులో కలిశారు. వారంతా ప్రస్తుతం దేశంలో వివిధ ప్రాంతాలలో స్థిరపడ్డారు. కొందరు వ్యాపారం, ఇంకొందరు ఉద్యోగం చేసుకొంటూ బిజీగా ఉంటున్నారు. వారంతా విశాఖలో రోజంతా సరదాగా గడిపా రు. పాత జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకొని సందడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనాటి మధుర స్మృతులు ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. వాటిని మళ్లీ గుర్తు చేసుకోవడానికి అందరం ఒకేచోట కలిశామని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వై.శ్రీనివాసరావు, ఎన్.జోగారావు, ఆర్.నాగరాజు పట్నాయక్, ఎం.వి గంగాధర్, దల్లి శ్రీనివాస రెడ్డి, పి.చంద్రశేఖర్, బి.దేవుడు, వినోద్, ప్రజాద్, నరసింగరావు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు సాయపడండి



మాట్లాడుతున్న రిటైర్డ్ కల్నల్ సుబ్బారావు

సీతంపేట: కుటుంబ ఆదరణ లేని వయోవృద్ధులకు సాయపడాలని రిటైర్డ్ కల్నల్ సుబ్బారావు పిలుపునిచ్చారు. వింటేజ్ విశాఖ సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎ.హైమావతి, జి.మోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఫోరం సమావేశం నిర్వహించారు. పలువురు సీనియర్ సిటిజన్లు తమ అభిప్రాయాలు, ఆలోచనలు సభకు తెలియపర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో 17 శాతం సీనియర్ సిటిజన్లు ఉన్నారని, వారికి అవసరమైన డే కేర్ సెంటర్లు, రిక్రియేషన్, వెల్ఫేర్ కోసం అడిగే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇది కావాలని ప్రభుత్వాన్ని, అధికారులను అడిగేందుకు ముందుకు రావడం లేదన్నారు. సీనియర్ సిటిజన్లు తాము నివసించే ప్రాంతంలో ఉన్న వయోవృద్ధులతో ఒక అసోసియేషన్ ఏర్పాటు చేసి జిల్లా సంఘానికి అనుబంధం చేసుకుంటే బలం పెరుగుతుందని సూచించారు. మానసిక బాధలో ఉన్న వయోవృద్ధులకు తాము ఉన్నామని చేయి సాయంగా అందివ్వాలని సుబ్బారావు కోరారు. కార్యక్రమంలో ఫోరం కోశాధికారి డాక్టర్ మురళీరాజ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

తొలగించిన పాఠ్యాంశాలు పునరుద్ధరించాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట: నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చి అండ్ ట్రెనింగ్(ఎన్‌సీఈఆర్‌టీ) సంస్థ ఏకపక్షంగా 10, 12 తరగతుల పుస్తకాల నుంచి ముఖ్య పాఠ్యాంశాలను తొలగించిన నేపథ్యంలో ఈ అంశంపై ఆదివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సౌత్ ఇండియన్ ఎలయన్స్ ఫర్ ఫండ్‌మెంటల్ రైట్ టు ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆచార్య వి.బాలమోహన్‌దాస్, ఆచార్య ఎస్.రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ, సంస్థ కన్వీనర్ నరవ ప్రకాశరావు, ప్రేమ సురేష్, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు శేషగిరిరావు, గోపాలరావు తదితరులు మాట్లాడారు. నూతన విద్యా విధానం పేరుతో సిలబస్ నుంచి తొలగించిన డార్విన్ సిద్ధాంతం, మహాత్మా గాంధీ హత్య, మొఘల్ చక్రవర్తుల చరిత్ర, గుజరాత్ అల్లర్లు, ఆర్ఎస్ఎస్ నిషేధం పాఠాలను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. చరిత్రను వక్రీకరించడం గర్హనీయమని, ప్రభుత్వాలు మారినపుడు సిలబస్ మార్చడం సరికాదన్నారు. ఈ పాఠ్యాంశాల మార్పు 18 రాష్ట్రాల్లోని సుమారు 5 కోట్ల మంది విద్యార్థులపై ప్రభావం చూపుతుందన్నారు. సమైక్య విద్యా విధానం అవసరమని, విద్య రాష్ట్ర అంశం కానీ, కేంద్ర ప్రభుత్వం బలవంతగా రాష్ట్రాలపై రుద్దుతున్న వైనం ఆక్షేపణీయమన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ రాష్ట్ర ఎస్‌సీఈఆర్‌టీలకు సముచిత స్థానం కల్పించాలని, కరిక్యులమ్ స్టీరింగ్ కమిటీలో రాష్ట్రాలకు స్థానం కల్పించాలని కోరారు.

యువతి అదృశ్యం

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా. మురళీనగర్ తెన్నేటి నగర్‌కు చెందిన మొయ్యి లిఖిత ఈ నెల 27 నుంచి కనిపించడం లేదు. పీఎం పాలెం సాంకేతిక విద్యా పరిషత్‌లో బీ–టెక్ చదువుతోంది. రోజూ మాదిరిగానే ఈ నెల 27వ తేదీ గురువారం ఉదయం కాలేజీకి వెళ్లింది. రాత్రి 8 గంటలు అయిన ఇంటికి రాకపోవడంతో, ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ చేసి ఉంది. చుట్టుపక్కల, బంధువులు, మిత్రులను కుటుంబ సభ్యులు సంప్రదించినా ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానం వచ్చి ఇంట్లో చూడగా.. 5 తులాల బంగారం, రూ.35 వేలు నగదు కూడా కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తండ్రి మొయ్యి రాజేంద్ర నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచరపాలెం సీఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ రమేష్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘కేంద్రం మొండిగా వ్యవహరిస్తోంది’

అల్లిపురం: విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆయనను విశాఖ ఉక్కు పరిరక్షణకు యూనియన్ సంఘాలు ఆదివారం కలిసాయి. ఈ సందర్భంగా ఆయన సంఘాల పోరాటానికి సంఘీభావం తెలిపారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం కాకుండా ఉండడానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలను యూనియన్ నేతలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ పాల్గొన్నారు.